నడకతో ఆరోగ్యం..

- వ్యాయామంతో మేలు
- చిన్నాపెద్దలు వాకింగ్
- నడకపై పలువురి ఆసక్తి

నిర్మల్‌ఖిల్లా: మానవ శరీరానికి దివ్యమైన ఔషధం నడక ఒక్కటే. ప్రతిరోజూ ఉదయం గంట నడిస్తే చాలు ఆరోగ్యానికి మంచిది. ప్రస్తుత కాలంలో ఊబకాయం, గుండెపోటు, మధుమేహం ఇలా తదితర వ్యాధులు చుట్టుముట్టి వేధిస్తున్నాయి. ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించాలంటే చక్కని వ్యాయామంతోపాటు ఉదయం, సాయంత్రం వేళలో నడక మేలు చేస్తుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. జిల్లాకేంద్రంలో చిన్నాపెద్దలు నడకపై ఆసక్తి చూపతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, ఎన్టీఆర్ మినీ స్టేడియంతోపాటు మహాలక్ష్మి ఆలయ పరిసరాలు, చించోలి(బి) తదితర ప్రాంతాల్లో నడక చేసే వారి సంఖ్య పెరిగింది. మైదానాల్లో రోజు ఉదయం నడక సాగించడం వల్ల స్నేహబంధం బలపడుతుంది. అందరూ కలిసి ఉదయం గంటపాటు వాకింగ్ చేస్తూ ఆత్మీయ ముచ్చట్లు పెట్టుకుంటున్నామని పలువురు వాకర్స్ 'సాక్షి'తో పేర్కొంటున్నారు.


జిల్లాకేంద్రంలోని డిగ్రీకళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న వాకర్స్ బృందం సభ్యులు (ఫైల్)

ప్రయోజనాలు ఇవి..

- 3 నుంచి 5 కి.మీ దూరం నడక సాగించడం మంచిది. శరీరం రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.
- గుండె జబ్బులు, క్యాన్సర్లు తదితర ప్రమాదాలు తగ్గుతాయి.
- మానసిక ఒత్తిడి డిప్రెషన్ తొలగి మనసు ప్రశాంతంగా ఉంచుతుంది. జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- నడక ద్వారా కొవ్వును కరగడం, రక్తప్రసరణ సరిగ్గా జరుగుతుంది. కండరాలు ఎముకలు బలపడతాయి.
- ఏకాగ్రతతోపాటు ప్రశాంతతకు నడక దోహదపడుతుంది.

రోజంతా ఉల్లాసం


గత కొన్నేళ్లుగా ఉదయం దోస్తులతో కలిసి వాకింగ్ చేయడంతో రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా అనిపిస్తుంది. ఇప్పటివరకు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉంటున్నాను.
– దువ్వాసి రాజేశ్, శ్రీనగర్ కాలనీ

సాయంత్రం వేళల్లో


ఉదయం వీలుకానప్పుడు సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తున్నాను. అనేకమంది మిత్రులు ఏర్పడి కలిసి నడక సాగిస్తున్నా. సాయంత్రం వాకింగ్ ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. వాకర్స్ అసోసియేషన్ కూడా ఏర్పర్చుకున్నాం. – లక్ష్మీనర్సింహారెడ్డి, శాంతినగర్

వాకింగ్‌తో ఆరోగ్యం


ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిది. వాకింగ్ ప్రారంభించిన రెండు, మూడు వారాల తర్వాత ఫలితం కనిపిస్తుంది. శరీరం ఉత్సాహంగా అనిపిస్తుంది.
– డాక్టర్ శశికాంత్, ఎంఎస్(జనరల్ సర్జన్)

'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయాలి

భైంసాటౌన్: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకం ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో బీజేపీ మండల నాయకుడు భోస్లే పండిత్‌రావ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకునేలా ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఇంటిపై జెండా ఏర్పాటు చేసుకుని విజయవంతం చేయాలని కోరారు. పండిత్‌రావ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 2 వేల జాతీయజెండాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భుమేశ్, సీనియర్ నాయకులు సోలంకి భీంరావు, రమణారావు, ప్రధాన కార్యదర్శి అశోక్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి, దిగంబర్, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. పట్టణంలోని విశ్రాంతిభవనం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.


త్రివర్ణ పతాకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, బీజేపీ నాయకులు

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. నాయకులు ప్రకాశ్, సంతోష్, రాజశేఖర్, గోపాల్‌రెడ్డి, పెద్ది రమేశ్, శ్రీనివాస్, స్వామి, రమేశ్, నవీన్, సాయి, భీమన్న పాల్గొన్నారు.

నేడు భైంసాలో తిరంగా ర్యాలీ

భైంసాటౌన్: పట్టణంలో మంగళవారం తిరంగా ర్యాలీ చేపట్టనున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్ఎస్ కాటన్ నుంచి తిరంగా బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, వివేకానంద చౌక్, కపడా మార్కెట్, పంజేషా, పురాణబజార్, కిసాన్‌గల్లీ శిశుమందిర్, మహాదేవ్ మందిర్, డీఎస్పీ కార్యాలయం, ఫిష్ మార్కెట్ నుంచి బస్టాండ్ మీదుగా శివాజీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బురద కష్టాలు తీర్చండి

కుంటాల: కల్లూరులో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు బురదమయంగా మారా యి. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా రు. ఈ మేరకు కార్యదర్శిని సోమవారం కలిసి విన్నవించారు. గత శనివారం సమస్య విన్నవిస్తే పట్టింపు లేకుండా కార్యదర్శి ఫోన్‌లో మాట్లాడారని గ్రామస్తులు తెలిపారు. స్పందించిన ప్రత్యేకాధికారి సోమలింగారెడ్డి రెండు రోజుల్లో మరమ్మతు చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు వెళ్లారు.


పంచాయతీ కార్యదర్శిని కలిసిన గ్రామస్తులు

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ముధోల్: ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామారావుపాటిల్ సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 62 మందికి రూ.15లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీచేస్తున్న సీఐ నైలు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద సీఐ నైలు సోమవారం వాహనాల తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనపత్రాలను వాహనదారులు తమవెంట తెచ్చుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుంటాల: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని సేఫ్టీ వార్డెన్ కె.ఎల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరులో రోడ్డు భద్రతపై ప్రయాణికులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన గమ్యం యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీబీలు గుద్దేటి శ్రీనివాస్, బండారి సాయన్న పాల్గొన్నారు.

బాసరలో భక్తుల పూజలు


పూజలు చేస్తున్న గౌరీశంకర్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని సోమవారం శ్రీవిద్య ఉపాసకులు బ్రహ్మశ్రీ పీ.వీ.గౌరీశంకర్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ సోమవారం సందర్భంగా బాసరలో భక్తుల రద్దీ కనిపించింది. పాపహరేశ్వర ఆలయంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

బెంచీల వితరణ

కుంటాల: మండలంలోని లింబా(కే) ఉన్నత పాఠశాలకు 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం బెంచీలను వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సేద తీరేందుకు రూ.50 వేల విలువ చేసే 12 బెంచీలను అందజేశారు. హెచ్ఎం మిట్టపల్లి నర్సయ్య వీరిని సన్మానించారు. ఆత్మ మాజీ చైర్మన్ సవ్వీఅశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, పీఆర్టీయూ మండల బాధ్యులు సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు రాకుండా చూడాలి

ఖానాపూర్: పట్టణంలోని రోడ్లపై పశువులు రాకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం యజమానులకు సూచించారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను ఇటీవల అధికారులు పట్టుకున్న విషయం విదితమే. వాటిలో నుంచి కొందరు యజమానులు వచ్చి తీసుకెళ్లారు. ఇంకా కొన్నింటిని తీసుకపోయేవారు రాకపోవడంతో సోమవారం మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించే క్రమంలో యజమానులు సోమవారం జరిమానా చెల్లించి పశువులను తీసుకెళ్లారు. అబ్దుల్ కలీల్, సంతోష్, రాజేందర్, మహేశ్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెంబి: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెంబి ఎస్సై శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి ఆటోలు నడపవద్దన్నారు. పోలీసులు ఉన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్యే రామారావుపాటిల్

ముధోల్: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చి రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే రామారావుపాటిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన రైతు రచ్చబండ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌తో కలిసి హాజరయ్యారు. అంతకుముందు ముధోల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 420 హామీలు ఇచ్చినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఏఒక్కటి నెరవేర్చలేదన్నారు. బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కేటాయించలేదని మండిపడ్డారు. రైతులకు రూ.15 వేల పెట్టుబడి సాయం, కౌలు రైతులకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ ఏడు నెలల్లో చేసిన అవినీతి, గత ప్రభుత్వం కేసీఆర్‌తో దోస్తీ, ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టేలా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపాటిల్

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

లక్ష్మణచాంద: పరిసరాలు పరిశుభ్రత పాటించాలని హెచ్ఈవో హరికుమార్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో సోమవారం ఇళ్ల వద్ద నిల్వ ఉన్న వర్షపు నీటిని ఆయన పారబోశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. సూపర్‌వైజర్ మతిన్, ఆరోగ్య కార్యకర్త శివ క్రిష్ణగౌడ్, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


నిల్వ నీటిని పారబోస్తున్న హరి కుమార్ గౌడ్

వాటోలిలో వైద్యశిబిరం

భైంసారూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వైద్యుడు ప్రశాంత్ అన్నారు. మండలంలోని వాటోలి గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే చేపట్టారు. వైద్యసిబ్బంది 52 మందికి పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న ఏడుగురి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీచేశారు. హెచ్ఈవో సలీం, సిబ్బంది దేవమ్మ, దత్తరాం, శాంత, సుజాత, తదితరులు ఉన్నారు.


ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆలయాలు కిటకిట


కుంటాల: శ్రీ ఉమామహేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తానూరు: శ్రావణమాసం రెండవ సోమవారం పురస్కరించుకుని మండలంలోని బోరిగాం గుట్ట ప్రాంతంలోని మహాదేవున్ని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. హిప్నెల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రకాంత్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు బాశెట్టి రాజన్న, నాయకులు లక్ష్మణ్ పటేల్ ఉన్నారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వర, దౌనెల్లి,ఓ లా శివాలయం,కుంటాలలోని ఆత్మలింగాలయం, మహాదేవుని, శ్రీ ఉమా మహేశ్వర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.


తానూరు: బారులు తీరిన భక్తులు

పెరిగిన బీరకాయ ధర


లోకేశ్వరంలో బీరకాయ సాగు

- 25 కిలోల బాక్స్ రూ.650
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

లోకేశ్వరం: ప్రస్తుత సీజన్‌లో బీరకాయ సాగు చేసిన రైతుల మోములో ఆనందం వ్యక్తమవుతోంది. ధర బాగుండడంతో మంచి ఆదాయం సమకూరుతుండడమే ఇందుకు కారణం. ప్రస్తుతం 25 కిలోల బాక్సు రూ.650 పలుకుతుంది. కిలో చొప్పున విక్రయించే రైతులకు 25 కిలోలకు రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తోంది. అధిక వర్షాల కారణంగా బీరకాయ పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అయినా ధర బాగుండడంతో లాభాలు వస్తున్నాయి. ముధోల్ డివిజన్ సుమారు 800 ఎకరాల్లో సాగు చేశారు. వ్యాపారులే వ్యవసాయ క్షేత్రాలకు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీన్ని జిల్లా అవసరాలకే కాకుండా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఎకరం సాగు చేస్తే పంట పూర్తయ్యే వరకు వెయ్యి బాక్సుల బీరకాయ పంట దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. రోజు తప్పిరోజు ఎకరం భూమిలో 15 నుంచి 20 బాక్సుల బీరకాయ వస్తుంది. ప్రస్తుతం దిగుబడి కూడా బాగానే ఉంది.


సిద్ధంగా ఉన్న బీరకాయల బాక్స్

నిలకడైనా ధర..

ప్రస్తుతం బీరకాయ పంటకు లభిస్తున్న ధరతో రైతులు ఆనందం వ్యక్త చేస్తున్నారు. నెలన్నర రోజుల నుంచి నిలకడైనా ధర లభిస్తోంది. ముందుగా బాక్సు రూ.550 నుంచి రూ.650 పలికింది. తర్వాత తగ్గింది. 500 కంటే తక్కువ ధర ఏనాడూ పలకలేదు. ఇంత నిలకడగా బీరకాయ పంటకు ధర ఉండడం ఇదే మొదటిసారని రైతులు అంటున్నారు.

ఆనందంగా ఉంది


ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన బీరకాయ పంటకు ధర బాగుంది. రెండు రోజులకు 25 నుంచి 30 బాక్సుల బీరకాయ దిగుబడి వస్తోంది. ఆనందంగా ఉంది.
– ప్రకాశ్, నగర్‌తండా

నిలకడగా ఉంది


బీరకాయ ప్రస్తుత సంవత్సరం నిలకడైన ధర పలుకుతుంది. ప్రస్తుత సంవత్సరం మంచి లాభాలు వస్తున్నాయి. గతంలో ఎప్పుడు కూడా ఇంత నిలకడగా ధర లభించలేదు.
– రాంరెడ్డి, రాయపూర్‌కాండ్లీ

ఈరోజు

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నర్సాపూర్(జి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుష్పలత ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో ఏప్రిల్ 1 2023 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై బృందం సభ్యులు తనిఖీ నిర్వహించి నివేదిక సమర్పించనున్నారు.

నిర్మల్ బంద్

నిర్మల్‌టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఆలయాలపై జరుగుతున్న దాడులు నిరసిస్తూ మంగళవారం పట్టణ స్వచ్ఛంద బంద్‌కు సనాతన ధర్మ పరిరక్షణ సమితి నాయకులు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు పట్టణ వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పర్యటన

తానూరు: మండలంలో మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పర్యటించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు యాతలం చిన్నారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైతు వేదిక కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భైంసాలో వర్షావాజ్

తానూరు: భైంసా పట్టణంలోని టెగ్గిలో ఉన్న బుద్ధవిహార్‌లో మంగళవారం భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో వర్షావాజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు వాగ్మారే ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి భారతీయ బౌద్ధమహాసభ సభ్యులు, మహిళా సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాంలు, పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సోమవారం వారు పాఠశాల సందర్శనకు వెళ్లారు. అక్కడ విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫాంలు గమనించి యాజమాన్యాన్ని నిలదీశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. గణేశ్, నరేశ్, బన్నీ, సుబ్బు, అరుణ్, తదితరులు ఉన్నారు.

డెంగీపై కళాజాత

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర పంచాయతీ ఆవరణలో సోమవారం డెంగీపై కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు సీజనల్ వ్యాధులపై కళాజాత ప్రదర్శనచేపట్టారు. నిర్మల్ కళా బృందం సభ్యుడు సురేందర్, గ్రామ కార్యదర్శి శ్రీధర్, నాయకులు శ్రీనివాస్‌రావు, సాహెందర్, సంజీవ్‌రెడ్డి, సాయాగౌడ్, ప్రకాశ్ ఉన్నారు.

గుంతలు పూడ్చివేత

లోకేశ్వరం: మండలంలోని గౌడిసెరా నుంచి రాయపూర్‌కాండ్లీ గ్రామాలకు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు దత్తురాంపటేల్ తన సొంత డబ్బులు రూ.25 వేలతో గుంత వద్ద మొరం పోయించి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన్ను గ్రామస్తులు సన్మాణించారు.


మొరంతో పూడ్చివేస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు దత్తురాం పటేల్

కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న యువకులు

నర్సాపూర్ (జి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా గొల్లమాడలో హిందూ యువత ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. గొల్లమాడ హిందూ యువత ఆధ్వర్యంలో చేపట్టారు.